

# సుందరుల తత్వము

'చలం'

అందమైన స్త్రీలే తక్కువ, అందులో తమకి అందమున్నదనీ, అందము మహిమాన్వితమైన శక్తి అనీ భౌతికమనోవిజయాలకు అమోఘ సాధనమనీ, వివేకమున్న స్త్రీలు మరీ తక్కువ. తమ స్వంత ఆనందం కోసంగానీ, దేశోపకారార్థం గానీ, విప్లవోద్దేశ్యంతో గానీ, సౌందర్య శక్తిని వుపయోగించడం యీ దేశపు స్త్రీలు నేర్చుకోలేదు. కొంతమంది మాత్రం, ఇప్పుడిప్పుడే మేలుకొని, తమస్వంత విషయాలలో, స్వల్పలాభాలకు వినియోగించు కుంటున్నారు. అంతకన్న, సౌందర్యవతులైన స్త్రీలు చెప్పిన మాటలినే బంధువులుగా తమకుగల పురుషులు, ఆ స్త్రీల ద్వారా దుర్ఘటమైన కార్యాలు సాధించు కుంటున్నారు.

ధనమూ, బలమూ, తెలివీ, వలెనే సౌందర్యంకూడా ఒక వరమూ, ఒక సాధనమూ. కాని తక్కిన వాటి వలె యీ సాధనాన్ని స్త్రీ కార్య సాఫల్యంకోసం వినియోగించుకోడం, ప్రపంచం వొప్పుకోటం లేదు. తెలివీ, సౌందర్యమూ వాక్చాతుర్యమూ గల పురుషుడు పరవశీకరణము చేత లబ్ధమనోరథు డైతే, ఎవరూ తప్పుగా ఎంచరు. ధనాన్ని బుద్ధిని, బలాన్ని, యే కార్యసాధనలకు ఎరువిచ్చినా, అంగీకరిస్తున్నారు.

కాని స్త్రీ తన సౌందర్యాన్ని కార్యసాధనకు వినియోగించడంలో ఒక భేదం తటస్థపడుతోంది. ఈ సౌందర్యాకర్షణ, ఆకర్షణతో ఆగక, అంతకన్న సామీప్యసాఫల్యాన్ని స్ఫురింప చేస్తోంది. స్త్రీ శరీరంతో బాటు శరీర సౌందర్యం కూడా తన హక్కు అనుకున్న పురుషుడు, తనలాభం కోసం వినియోగించుకున్నా, ఆమెస్వంత వుపయోగార్థం వినియోగించనీడు. అంతే గాక తన సౌందర్య ఐశ్వర్యాన్ని చవకగా పంచిపెట్టడంవల్ల, ఆ ఐశ్వర్యం తరగక పోయినా, విలువ మాత్రం తగ్గుతుందని స్త్రీ 'అనాకర్షణీయంగా' గా ఫీలవుతుంది. నాట్యానికి గాని, చిత్రరచనకు గాని, నాటకరంగం మీద గాని, సినిమాలో గాని ఆమె సౌందర్యం బహిరంగం కావడానికి పురుష అహంభావం అంగీకరించదు. కాని స్త్రీవాంఛ మాత్రం వీలైనంతవరకు తన సౌందర్యలాభం పొందా

లనేవుంటుంది. కాని పురుషాజ్ఞాధికారము గాని, పురుషనిర్మిత పాతివ్రత్యాశయ భగ్నం గాని ఆమెకి రుచించదు. అందువల్ల చిత్రమైన సమస్య యేర్పడ్డది. అది యితర పురుష ప్రపంచం యెడల క్రూరరూపాన్ని ధరించింది. ప్రస్తుత స్త్రీ హృదయమెట్లా వుందంటే, తన అందాన్ని చూసి పురుషుడు ఆకర్షణ పడాలి. భ్రమిసినట్టు తనకు తెలియ చెయ్యాలి. ఎంత తీవ్రంగా తనని కాంక్షించినట్టు తోస్తే అంత తృప్తి. కాని ఏ అంతం కోరి, ఏ వుద్దేశ్యంతో తనను కాంక్షిస్తున్నారో, అది ఆమెకు అనంగీకారము. తాను ప్రేరేపించిన కాంక్షను పురుషుడు దమము చేసుకున్నా సరే, లేక ఆ అగ్నిలో మండి భస్మమైనా సరే, కాని, పురుషుడు, తనకూ ఆమెకూ తప్ప, యితరులకు వ్యక్తి పడేట్టు, చూపుల వల్లగాని, వాక్కుల వల్లకాని, తన హృదయ వాంఛను బహిరంగ పరిచాడా, పరమ దుర్మార్గుడనే నింద పడ వలిసిందే: కాక ఆమె లావణ్యకాంతిని చూసి, ఏ అసాధారణ సూర్యాస్తమయశోభనో చూసినట్లు మురిసి, విభ్రాంతుడై, నాలుగు బారల దూరములో మూర్ఛాక్రాంతుడైతే, ఆమె మన్ననకు పాత్రుడౌతాడు. లావణ్యము వల్ల ఆకర్షణే లేని వాడు జడుడు; ఆకర్షణ వున్నదని బహిరంగ పరిచిన వాడు 'రౌడీ'. ఈ విషయమై నీతి నిబంధన కూడా విచిత్ర మైనది. పుష్పాల్లో, పటాల్లో, గీతాల్లో, సౌందర్యాన్ని గుర్తించ లేని వాడు పశువు. కృష్ణ, లక్ష్మీ, దేవీశరీరసౌందర్య స్తవాలకు అందని అత్మ, పాపి. పుష్పాలు, పటాలు, గీతాలు అనుభవించాలని కోరవొచ్చు. ఇతరుల ఆస్తి అయినా అవి, 'నాకో' అనుకోడం తప్పు కాదు. కృష్ణ, లక్ష్మీ, దేవుల సౌందర్యాలలో ఐక్యం కావాలనే కోర్కె వాంఛనీయము. కాని ఆ సౌందర్య పిపాసి నేత్రాలు పర స్త్రీ ముఖదర్శనం ముందు అంధములై పోవాలి. సౌందర్యాన్ని గుర్తించినా, నాకో!'' అన్నాడా వాడికి నరకప్రాప్తి. కొందరు ప్రస్తుతకాలపు బహిరంగ నీతివర్తనులే మంటారంటే, ఆ సౌందర్యాన్ని చూసి, ఆనందించి, సంతుష్టి పడలేవా?'' అని లభ్యం కాని విషయాల్లో అనడం మామూలు. సంతుష్టి పడేవాడున్నా, అతడు ఆమె భర్తతో "నీ భార్యసౌందర్యం నన్నాకర్షించింది. చూచి, ఆనందిస్తాను. ఆమె వెంటే తిరగని'' అంటే, వొప్పుకుంటాడా?

ఎందుకంటే, ఒక్కొక్క సౌందర్యం, ఒక్కొక్క విధమైన వాంఛను ప్రేరేపిస్తుంది. కమలాఫలం అందం, తినవలెననీ, పద్మం అందం వాసన చూడాలనీ, స్త్రీ సౌందర్యం, నాలుగైదువిధాల అనుభవించాలనీ వాంఛను కలిగిస్తాయి. కనక చూచి ఆనంద పడమనే వారి ఆలోచన అసాధ్యము.

ఆనటోల్ ఫ్రాన్సు జీవితచరిత్రలో యీ విషయానికి సంబంధించిన ఘట్టం ఒకటి వుంది:

ఫ్రాన్సుగారిని చూడాలని ఒకరోజు ఒక సౌందర్యవతి వొచ్చింది. ఆమె సంభాషణలో చెప్పింది కదా; ఎవరో యువకుడు మాటల వల్ల ఆమెని అవమాన పరిచాడన్నది. ఆయన ఏమన్నాడంటే, "అవమాన మెందుకనుకోవాలి మీరు? పురుషుడు స్త్రీని వాంఛించడం కన్న యింకో అధికమైన గౌరవమున్నదా? పూర్వ మొక ఆమె వుండేది. ఆమకు మనకి యీ రోజుల్లో వున్న దాని కన్న ఉన్నతిమైన జ్ఞాన ముంది ప్రేమను గురించి. ఆమె అన్నది కదా; తనిని వొంటరిగా వున్నప్పుడు కలుసుకునే అదృష్టమే ఎవడి కన్నా కలిగితే, అతడు వెంటనే మైమరిచి తన పై బడి. బలాత్కరించక పోతే, అతడు తనను అధికంగా అవమానించినట్టు భావిస్తానన్నది. ఏమంటారు?"

'స్త్రీలను గౌరవించండి' అని ప్రతివాడూ గోల పెడతాడు. అగౌరవ మంటే వాంఛించడ మని అర్థం. గౌరవం పొందడం అతిసులభం. ఇంక సల్భయేళ్లు గడిచి, మీ సౌందర్యం మాసి పోగానే, అంతు లేని గౌరవం పొందుతారు మీరు. ప్రతివాడూ గౌరవిస్తాడు. ఒక్కడూ వాంఛించడు. అప్పుడు అర్థమౌతుంది మీకు గౌరవం ఎంత నిస్సారమయినదో! కాని యిట్లా విరగబడి, మిమ్మన్ని ఆరాధించడం ఇంక ఎన్నియేళ్లు! కాలం పరిగెత్తుతోంది. తరుము కుని వొస్తోంది వృద్ధాప్యం. పురుషహృదయాన్ని జ్వలింప చేసేందుకే సృజించారు, సౌందర్యాన్ని. ఈ ఔన్నత్యం, యీ ఆనందం, ప్రతిభా, క్షణభంగురాలు. శాశ్వతంగా ఏనాడైనా లభించే శుష్క గౌరవానికీ, నియమాలకూ మనసుని వొప్ప చెప్పి, యీ క్షణిక అనుభవాన్ని వొదులు కుంటే మళ్లీ రాదు. మిమ్మన్ని చూసి యువకులు నిగ్రహించుకోలేక, కొంచెం మేరమీరినా, కనికరంతో వీక్షించండి. మీరే ఆలోచించండి సుందరమైన మీ నేత్రాలు, అద్భుతమైన మీ కనుబొమలు. దూకి వొచ్చే ముద్దులను గుమిగూడమని ఆహ్వానించే మీ పెదవులు ఇవన్నీ గౌరవాన్ని ఆపాదించేందుకు యిచ్చిందా సృష్టి మీకు?"

ఫ్లారిడా నించి వొచ్చిన ఆవనితాశిరోమణి ఫ్రాన్సుగారి వంక ఆశ్చర్యంతో చూస్తోంది అంతవరకు. ఆయన మాటలు ఆపగానే పక్కున నవ్వింది.

"మీకే పెళ్లి ఐ వుంటే, ఇతరులు మీ భార్యసౌందర్యాన్ని ఆవిధంగా వాంఛించడం వొప్పుకునే వారేనా మీరూ." అని అడిగింది.

"ఏమి? ఎందుకు వొప్పుకో కూడదు? నేనేం పీటరిదిగ్రేట్ సార్వభౌముడి కన్న అధికుణ్ణా? రష్యాచక్రవర్తి కన్న అధికారవంతుడనా, మానధనుడనా? మీకు తెలుసును కాదూ ఆయన యేం చేశాడో? తెలీదూ! పీటర్ చక్రవర్తి ఆస్థానంలో విల్లెబాయ్ అనే యువ్వనసభికు డుండే వాడు. చక్రవర్తి వివా

ార్థమై చాలాదూరంలో లీనానికి వెళ్లి వుండగా చక్రవర్తినికి ఆయన మెదో అవసరంగా కబురు పంప వలిసిన పని కలిగింది. చక్రవర్తిని మహాగర్విష్టి. "అద్భుతసౌందర్య నిధి" అని ప్రపంచ రాజ్ఞులలో పేరు పొందినది. విద్యావంతురాలు, కళామూర్తి. చక్రవర్తి ఉత్తరము వ్రాసి, దానిని తీసుకొని పోయి అవసరముగా ఆమె కిమ్మని విల్లిరాయ్‌ని ఆజ్ఞాపించాడు. రాత్రి, చలిబాధ, కవచంగా బ్రాంది బాగా పట్టించి గుర్రం మీద బైలు దేరాడు మన యోధుడు. తెల్లవారుతో వుండగా రాజ్ఞిహర్మ్యాన్ని చేరాడు. రాజముద్రాంకితము చూడగానే అవసరమని గ్రహించి రాణి ప్రైవేటు పడకగదిలోకి ప్రవేశ మిచ్చారు. చక్రవర్తిని పడుకుని వుంది. ఆమె అద్భుతలావణ్యాన్ని చూసేప్పటికి తాగిన బ్రాంది, గదిలోని వెచ్చదనము, మెత్తని హంసతూలిక పాన్పు, పరిమళాలసాంద్రత, నల్లగా చిక్కగా పరుచు కున్న ఆమె దీర్ఘ శిరోజాలు, పక్కకి ప్రేమతో వొదిలి వేసి పడు కున్న ఆమె నిర్లక్ష్యయుతమైన స్థితి, అన్నీ చూసి అతని హృదయంలో ఎటువంటి ఉద్రేకం కలిగిందో యెవరు వూహించ గలరు ?

ఏమైతేనేం? ఉత్తరమూ, అందివ్వడమూ, చక్రవర్తీ, అన్నీ మరిచి, మన వీరుడు—తానూ, లోకము, జాగ్రత్తా, అన్నీ తొలిగి పోయి నాయి అతని మనసు లోంచి. తాను వీర్యవంతుడైన పురుషుడు, ఆమె ఆకర్షణవతి యైన స్త్రీ. ఇవి మాత్రమే మిగిలాయి, నిమషానికి. తటాలున నిస్సంశయంగా ఆమె మీదకు వెళ్లి చుట్టూ చేతులు వేశాడు. ఆమె అరిచేందుకు గాని, పిలిచేందుకు గాని వ్యవధి కలగక పూర్వమే.—అంతా ఐ పోయింది.

తక్కిన సంగతి మనకు ముఖ్యం కాదు. కావలిసిందేమిటంటే, చక్రవర్తికీ సంగతి తెలిసినప్పుడే మన్నా డంటే—

"కాతరిన్ (చక్రవర్తిని) అందం చూస్తే, ఎవడి కన్నా అంత మైమరిచేట్టు తల తిరగడం ప్రమత్తత కలగడం చాలా సహజం. విల్లిరాయ్ యేమిటి! ఆ స్థితిలో ఆమెని చూస్తే నేనైనా ఆ పని చేశే వాణ్ణే"

ఉపయోగిస్తేనే గాని, యీ లోకం లోని వొస్తువుల సౌందర్యం క్షీణిస్తుంది. స్త్రీదేహం కూడా అంతే. విద్య వలెనే సౌందర్యం కూడా ఇతరులకి యిచ్చిన కొద్దీ రాణిస్తుంది.

బొకాషియో, యే మన్నాడు ?

"ముద్దు పెట్టుకొన్న ప్రతిసారీ, స్త్రీముఖం, చంద్రుడి వలెనే క్రమంగా వికాసాన్ని నూతన సౌందర్యాన్ని పొందుతుంది."

కాలం తీసుకొచ్చే బలాత్కారమైన మార్పులు తప్ప పురుషుడి బలాత్కారాన్ని చూసి కోపగించుకోడం తీవ్రమైన పొరబాటు"

అని బుద్ధి నేర్పాడు ఆనటోల్ ఫ్రాన్సు ఆమెకి.

ఆంధ్రవనితలారా, ఆలోచించు కోండి.